క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



ముత్తుకూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్య సంఘం నేతలు ముత్తుకూరులో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘ అధ్యక్షుడు గుడివాడ ఉమామహేశ్వరరావు, కార్యదర్శి చందా వెంకటస్వామి, కోశాధికారి అటవర్తి సుబ్బారావు, ఉపాధ్యక్షులు పేర్ల సత్యనారాయణ, కనిశెట్టి సుబ్బయ్య, మిరియాల నిరంజన్, సంయుక్త కార్యదర్శులు తటవర్తి శ్రీనివాసులు, మలిశెట్టి చలపతి, వెల్లంపల్లి భాస్కర్ మంత్రిని ఘనంగా సత్కరించారు.

భగవద్గీతపై ప్రచారం



పొదలకూరు : మండలంలోని డేగపూడి, చెర్లోపల్లి గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంట్లో కార్తీక దీప జ్ఞాన జ్యోతి వెలిగించాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పొదలకూరు కమిటీ అధ్యక్షుడు పెంచలనర్సయ్య, సభ్యులు కొండయ్య, పద్మమ్మ, కృష్ణయ్య, గాయత్రి, నర్సారెడ్డి, శేషాద్రి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

విడవలూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సచివాలయంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను జనవరి 26 వరకు నిర్వహించనున్నామని, ఎవరికైనా పథకాలు అందకుంటే అధికారులను సంప్రదించాలని కోరారు.

బాధ్యతగా పనిచేయండి

కోవూరు : మండలంలోని బూత్ లెవల్ అధికారులు బాధ్యతగా పనిచేయాలని తహసీల్దార్ ఎం.పద్మజ అన్నారు. కోవూరు తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల వివరాల పరిశీలన కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల పరిధిలో డబుల్ ఎంట్రీలు, మృతిచెందిన వారి వివరాలను నిబంధనల మేరకు తొలగించాలన్నారు. ఎన్నికల డీటీ మధు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ సుధా ఉన్నారు.

చోరీపై ఫిర్యాదు

వెంకటాచలం : మండలంలోని గొట్లపాళేనికి చెందిన నలగర్ల వెంకటరమణయ్య ట్రాక్టర్‌లో విలువైన వస్తువులను గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి చోరీ చేశారు. ట్రాక్టర్‌లోని బ్యాటరీ, టైర్లు తదితర రూ.60 వేల విలువైన వస్తువులను చోరీ చేశారని బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీఐ అంకమరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు వరం.. సన్నరకం



గుండాలమ్మపాళెంలో సాగులో ఉన్న ఆర్‌ఎన్‌ఆర్ 31479 రకం (ఫైల్)

- రబీ, ఖరీఫ్ పంటలకు అనుకూలంగా ఆర్‌ఎన్‌ఆర్ 31479
- తెగుళ్లను తట్టుకునే రకం
- మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు

కొడవలూరు : సన్నాలకే అతి సన్నరకంగా ఆర్‌ఎన్‌ఆర్ 31479 వరి రకం పేరు గడించింది. చిరు సంచుల రూపంలో అందుబాటులో ఉన్న ఈ రకం గతేడాది నుంచి చిరు సంచుల రూపంలో అందుబాటులోకి వచ్చింది. దీనిని గతేడాది జిల్లాలోని పలువురు రైతులు రబీ, ఖరీఫ్‌లలో సాగు చేశారు. ఖరీఫ్, రబీ రెండు పంటలకు అనుకూలంగా ఉండడంతో పాటు తెగుళ్లను సమర్థవంతంగా తట్టుకుని మంచి దిగుబడులు ఇస్తోంది. మార్కెట్‌లోనూ క్వింటాలుకు రూ.400 నుంచి రూ.500 అదనంగా ధర లభిస్తోంది. అంటే పుట్టికి రూ.3 వేల నుంచి రూ.4 వేల అధిక ధర పలుకుతోంది. ఈ రకం సాగు ఎంతో లాభదాయకమని రైతులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఈ రకం విత్తనానికి ఈ రబీలో బాగా డిమాండ్ పెరిగింది.



ఆర్‌ఎన్‌ఆర్ 31479 రకం బియ్యం నాణ్యత

అతి సన్నరకం

బీపీటీ 5204(సాంబ మసూరి), ఆర్‌ఎన్‌ఆర్ 15048(షుగర్ లెస్) రకాల కన్నా జైశ్రీరామ్, హెచ్ఎంటీ సోనా, కావేరి చింట్లు, అంకూరు 101లు సన్నని రకాలుగా గుర్తింపు పొందాయి. ఈ రకం వాటికన్నా 'ఆర్‌ఎన్‌ఆర్ 31479' పంట కాలం 120 రోజులు ఉంది. దీనిని తెలంగాణలోని రాజేంద్రనగర్‌లో ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు ఆర్‌ఎన్‌ఆర్ 15048, కేఎంపీ 199 రకాలతో కలిపి రూపొందించారు.

మంచి ఫలితాలు



గతేడాది రెండు పంటల్లో ఈ రకాన్ని రెండున్నర ఎకరాల్లో సాగు చేశాను. రబీలో ఎకరాకు నాలుగు పుట్ల దాకా, ఎడగారులో మూడు పుట్ల వంతున దిగుబడి వచ్చింది. చీడపీడలు ఆశించకపోవడం, తక్కువ ఎరువులను వాడడం వల్ల ఖర్చు గణనీయంగా తగ్గింది. మార్కెట్‌లో మంచి ధర పలకడం వల్ల లాభసాటిగా ఉంది. అందువల్లే ఈ రబీలో పది ఎకరాల్లో ఈ రకాన్ని సాగు చేస్తున్నాను.

– దేగా హరికిషన్, రైతు, గుండాలమ్మపాళెం

రైతుకు లాభదాయకం



గత ఎడగారులో ఎకరా పొలంలో ఈ రకాన్ని సాగు చేశాను. దిగుబడి ఆశాజనకంగా రావడంతో పాటు నూకలు కాకపోవడం, బియ్యం మంచి నాణ్యతతో ఉండడంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండి అధిక ధర పలికింది. మాకు లాభదాయకంగా ఉంది. రబీలో దిగుబడి పెరిగే అవకాశం ఉన్నందున ఈ రకాన్ని ఐదు ఎకరాల్లో సాగు చేస్తున్నాను.

– దేవళ్ల శ్రీనివాసులురెడ్డి, రైతు, విడవలూరు

అతి సన్నంలోనూ స్వల్పకాలిక రకం



ప్రస్తుతం మార్కెట్‌లో అతి సన్న రకాలైన జైశ్రీరాం, హెచ్ఎంటీ సోనాలకు భలే కిరాకీ ఉంది. ఆర్‌ఎన్‌ఆర్ 31479 రకాన్ని వీటిని పోలి ఉండేలా రూపొందించాం. అయితే వాటి పంట కాలం 135 రోజులు కాగా, దీని పంట కాలం కేవలం 120 రోజులు మాత్రమే. ఈ రకాన్ని తెలంగాణతో పాటు నెల్లూరు, కడప, చిత్తూరు, కర్ణాటక జిల్లాల్లో విరివిగా సాగు చేస్తున్నారు.

– డాక్టర్ ఎల్.కృష్ణ, ప్రధాన శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం, రాజేంద్రనగర్

ఆర్‌ఎన్‌ఆర్- 31479 ప్రత్యేకతలు

- ఈ పైరు 100 నుంచి 105 సెంటీమీటర్ల ఎత్తు ఉండడం వల్ల వరి నేలపై పడిపోదు.
- ఇది ఫొటో సెన్సిటివ్ రకం కానందున అన్నిరకాల వాతావరణాన్ని తట్టుకుంటోంది.
- తక్కువ మోతాదు ఎరువులతోనే మంచి దిగుబడి ఇస్తుంది.
- మోము పిప్పి, దోమపోటును కొంతవరకు తట్టుకుంటుంది. ఉల్లికోడు, పొట్ట కుళ్లను పూర్తిగా ఆశించదు.
- అతి సన్నగా ఉండడం వల్ల వెయ్యి గింజల బరువు 12 గ్రాములు మాత్రమే ఉంటుంది.
- ఈ బియ్యం మంచి నీరు కట్టు కలిగి నూకలు కాని రకం కావడంతో పాటు మిల్లింగ్ 65 నుంచి 66 శాతం దిగుబడి వచ్చి అన్నం నాణ్యత బాగుంటుంది.
- దిగుబడి ఎకరాకు మూడున్నర పుట్ల నుంచి నాలుగు పుట్ల వరకు వస్తుంది.

'ధర్మమే మనల్ని రక్షిస్తుంది'

- రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు : ధర్మాన్ని ఆచరిస్తే.. ధర్మమే మనల్ని రక్షిస్తుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ముత్తుకూరులో ఆదివారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా వనభోజనాల కార్యక్రమం జరిగింది. అనంతరం జరిగిన హిందూ ధార్మిక సమ్మేళనంలో మంత్రి పాల్గొని, ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో సుఖవంతమైన జీవితం గడపాలన్నారు. మతాలు, సాంప్రదాయాలు, విధానాలు ఎన్ని ఉన్నప్పటికీ అంతిమ గమ్యం ముక్తి మార్గమేనన్నారు. వ్యామోహాలకు దూరంగా ఉంటే ధర్మాన్ని ఆచరించే వ్యక్తులుగా జీవించగలమని అన్నారు. దయానంతగిరి స్వామి, ఫౌండేషన్ ప్రతినిధులు పోచారెడ్డి చెంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

అయ్యప్ప భక్తులకు భిక్ష ప్రారంభం

ముత్తుకూరులోని కామాక్షి సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నేత ఈదూరు రామ్మోహన్ రెడ్డి అయ్యప్ప భక్తులకు ఏర్పాటు చేసిన (భిక్ష) అన్న ప్రసాద వినియోగాన్ని మంత్రి కాకాణి ప్రారంభించారు. కార్తీక మాసం సందర్భంగా మహాశివుడికి ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధనరెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తోటపల్లిగూడూరు : మండలంలోని పాపిరెడ్డిపాళెం వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఇస్కపాళెంలోని కృపా వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం చేశారు. పారిశ్రామికవేత్త, ఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఆల్తూరు గిరీష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సర్పంచ్ కదురు సుబ్బయ్య, పేడూరు సొసైటీ డైరెక్టర్ తిరవళ్లూరు ఈశ్వరయ్య పాపిరెడ్డిపాళెంలోని గిరీష్‌రెడ్డిని ఆయన అతిథి గృహంలో కలిసి సన్మానించారు. పార్టీ నేతలు వేమారెడ్డి శ్యామ్‌సుందరరెడ్డి, తిరువళ్లూరు వెంకటేశ్వర్లు, నెల్లటంబాక వెంకటరమణయ్య, కరీముల్లా, జనార్దన్, మురళీ, మనోహర్, మోహన్ పాల్గొన్నారు.

దశాబ్దాల సమస్యకు పరిష్కారం



గతంలో దుస్థితిలో ఉన్న గిరిజన కాలనీ రోడ్డు



గిరిజన కాలనీకు నిర్మించిన సీసీరోడ్డు

- గిరిజన కాలనీ రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షలు
- గ్రామస్తులకు నివేశన స్థలాలు

పొదలకూరు : మండలంలోని గిరిజనుల దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభించింది. మండలంలోని వరదాపురం రుస్తుంమైన్ కాలనీలో నాలుగు దశాబ్దాలుగా గిరిజనులు నివాసం ఉంటున్నారు. వారి కాలనీకి సరైన రోడ్డు సౌకర్యం లేక వర్షాలు కురిస్తే నడిచేందుకు వీలులేనంతగా ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గిరిజనుల వద్దకు వెళ్లారు. వారు తమ సమస్యను మంత్రికి విన్నవించుకున్నారు. వెంటనే స్పందించిన ఆయన సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల చేయించి పనులు పూర్తి చేయించారు.

రోడ్డుకు రూ.30 లక్షల మంజూరు

మెయిన్‌రోడ్డు నుంచి కాలనీ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షలకు అంచనాలు వేశారు. మంత్రి చొరవ తీసుకుని నుడా నుంచి నిధులను మంజూరు చేయించారు. వెంటనే రోడ్డు పనులను చేపట్టాల్సిందిగా పేర్కొన్నారు. యుద్ధప్రాతిపదికన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం వల్ల తమ ప్రధాన సమస్య పరిష్కారమైందని గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ కాలనీకి సిమెంటురోడ్డు వస్తుందని కలలో కూడా ఊహించని గిరిజనులు సంబరాలు జరుపుకుంటూ మంత్రి కాకాణికి కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు నివేశన స్థలాల

ఇదే ప్రాంతంలో తాటిపర్తి గ్రామస్తులకు నివేశనా స్థలాలను మంజూరు చేశారు. న్యాయస్థానంలో ఉన్న అడ్డంకులను తొలగించి 2.50 ఎకరాల భూమిలో 54 ప్లాట్లను ఏర్పాటు చేసి మంత్రి కాకాణి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఇక్కడ పేదల కోసం జగనన్న కాలనీని నిర్మించేందుకు ఇష్టం లేని టీడీపీ నేతలు సైదాపురం మండలానికి చెందిన ఓ వ్యక్తి వద్ద న్యాయస్థానంలో పిటిషన్ వేయించారు. న్యాయపరంగా ప్రభుత్వం తరపున పోరాడి పేదలకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఇంకా నివేశన స్థలాలు మిగిలి ఉండగా అర్హులైన వారికి అందజేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

ఆదర్శప్రాయులు అంబేడ్కర్



ఇందుకూరుపేట : అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మనుబోలు దళితవాడలో..



కోవూరు జెడ్పీ హెచ్ఎస్‌లో..

- ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

ఇందుకూరుపేట : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆదర్శప్రాయులు అని ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ అన్నారు. భారత రాజ్యాంగం అమలు దినోత్సవం సందర్భంగా మండలంలోని డేవిస్‌పేటలో బాబాసాహెబ్ విగ్రహానికి ఆదివారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితాన్నే అర్పించిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. నేటి యువత ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బీవీ రమణయ్య, పార్టీ నేతలు సునీల్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, ముంగర శ్రీకాంత్ పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తి కొనసాగాలి

మనుబోలు : ప్రతిఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తితో మెలగాలని వైఎస్సార్‌సీపీ నేతలు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, చిట్టమూరు అజయ్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మనుబోలు దళితవాడ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని కుల, మత, వర్గాలకు అతీతంగా ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించేలా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని తీర్చిదిద్దారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు ముంగర రవీందర్‌రెడ్డి, వేలూరు భాస్కర్‌రెడ్డి, చలగల దయాకర్, చిట్టమూరు దయాకర్‌రెడ్డి ఉన్నారు.

- కోవూరు : మండల కేంద్రంలోని పచ్చిపాల రామనాథమ్మ జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్ఎం నరసింహమూర్తి మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకల్పనలో అంబేడ్కర్ కృషి ఎనలేనిదన్నారు.

జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం



కొడవలూరులో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: 16వ వార్డులో..

కొడవలూరు : పేదల ఆర్థికాభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ నేతలు అన్నారు. కొడవలూరులో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు తొలగి ప్రజలంతా బాగుండాలంటే జగనన్నను మరలా సీఎంను చేసుకుందామని కోరారు. వైఎస్సార్‌సీపీ నేతలు నీలి నాగేశ్వరరావు, కుప్పాల నాగేశ్వరరావు, ఎస్.చిన్నా పాల్గొన్నారు.

ప్రతిఇంటికీ సంక్షేమ పథకాలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని 16వ వార్డులో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికి లబ్ధి చేకూరుతోందన్నారు.

అపూర్వ సమ్మేళనం



మనుబోలు : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1994–95 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అదే పాఠశాలలో ఆదివారం కలుసుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ క్రమంలో వారి గురువులను ఆహ్వానించి సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అప్పటి హెచ్ఎం రాధాకృష్ణమూర్తి, పీఈటీ అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి, మాలకొండయ్య, బీఎస్‌ఆర్ ప్రసాద్, విశ్వనాథ్, అంకయ్యలకు విద్యార్థులు పాదపూజ చేసి శాలువాలు కప్పి సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థులు కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, తాళ్లూరు ప్రసన్న పర్యవేక్షించారు.

రొయ్యల చెరువులతో పంట వేసుకోలేకున్నాం



వరద నీటిలో రైతు

తోటపల్లిగూడూరు : చుట్టూ ఉన్న రొయ్యల చెరువులతో వరి పంట వేసుకోలేని దుస్థితి నెలకొందని పొట్లపూడి గ్రామానికి చెందిన సన్నకారు రైతులు ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక పంట పొలాల వద్ద రైతు అనపల్లి హరిబాబు మాట్లాడారు. గ్రామానికి చెందిన ఐదుగురు దళిత రైతులకు 20 ఎకరాల సాగు భూమి ఉందని, ఒకే బిట్టుగా ఉన్న భూమికి ఓ వైపు పారుదల కాలువ ఉండగా మిగిలిన మూడు వైపులా రొయ్యల చెరువులు ఉన్నాయన్నారు. తమ పొలాల నుంచి వరద నీరు వెళ్లేందుకు గతంలో ఉన్న కాలువలను ఆక్వా రైతులు పూడ్చి వేశారని, దీంతో వర్షాకాలంలో తమ పొలాల నుంచి వరదనీరు బయటకు పోవడం లేదన్నారు. దీంతో పంట వేసుకోలేకున్నామని వాపోయారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఆశావర్కర్‌పై కేసు నమోదు

ఇందుకూరుపేట : మండలంలోని డేవిస్‌పేటకు చెందిన ఆశావర్కర్ సేలం సుజాతతో పాటు ఆమె కుమారుడు చందుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరేంద్రబాబు ఆదివారం తెలిపారు. పాములవారిపాళేనికి చెందిన సుమతి అనే మహిళ వద్ద కారు తీసుకుని కొంత నగదు చెల్లించి మిగిలిన నగదు చెల్లించకుండా మోసం చేశారని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వివరించారు.

నేత్రపర్వం.. కార్తీక దీపోత్సవం



ఇందుకూరుపేట : మైపాడు బీచ్‌లో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



పొదలకూరు : శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ముత్తుకూరు : కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శివ నామస్మరణతో హోరెత్తాయి. కార్తీక మాసంలో ముఖ్యమైన రోజు కావడం వల్ల ముత్తుకూరు, వల్లూరు, పిడతాపోలూరు, పోలంరాజుగుంట గ్రామాల్లోని శివాలయాల్లో మహిళలు దీపాలు వెలిగించి పూజలు ఆచరించారు. కృష్ణపట్నం సిద్ధేశ్వరాలయం, ఈపూరు విరూపాక్షేశ్వరాలయం, పైనాపురంలోని భోగేశ్వరాలయం, బ్రహ్మదేవిలోని కైలాసనాథేశ్వరాలయాల్లో నేత్రపర్వంగా పల్లకిసేవ నిర్వహించారు. ధ్వజస్తంభాల వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించి, మొక్కుకున్నారు.

వైభవంగా..

పొదలకూరు : పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. కార్తీక మాసంలో పౌర్ణమి రోజున 365 దీపాలు వెలిగిస్తే శివుని కృపకు పాత్రులవుతారనే నమ్మకంతో మహిళలు అధిక సంఖ్యలో దీపాలు వెలిగించారు. ప్రధానార్చకుడు ప్రసాద్‌స్వామి, కుమారస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

మనుబోలు : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మనుబోలు శివాలయం, వీరభద్రస్వామి ఆలయం, సంగమేశ్వరాలయాలతో పాటు, బద్దెవోలు, పిడూరుపాళెం, వెంకన్నపాళెం, కొలనకుదురు, పిడూరు, మడమనూరు, చెర్లోపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మహిళలకు మంగళ స్నానాలాచరించి ధ్వజస్తంభాల వద్ద కార్తీక దీపాలు వెలిగించి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. కాగా కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని యాచవరానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాము బొగ్గుతో సెంటీమీటరు సైజులో శివలింగాన్ని రూపొందించాడు.

ఆలయాల్లో కార్తీక శోభ

ఇందుకూరుపేట : కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో కార్తీకశోభ నెలకొంది. మండలంలోని మైపాడులో కొలువైన అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, పల్లకిసేవ జరిగింది. ఆకాశ దీపోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. పల్లిపాడులోని మీనాక్షి సమేత రామేశ్వర వేణుగోపాలస్వామి ఆలయంలో అభిషేకాలు, జ్వాలా తోరణం, పల్లకిసేవ తదితర కార్యక్రమాలు జరిగాయి. కొమరికలోని కుంబేశ్వర స్వామి ఆలయలో విశేష పూజలు నిర్వహించారు. ఇందుకూరుపేట, కొత్తూరు, గంగపట్నం, కొరుటూరు గ్రామాల్లోని శివాలయాల్లో కార్తీక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

మైపాడు బీచ్‌లో భక్తుల కోలాహలం

మండలంలోని మైపాడు బీచ్ భక్తులతో కోలాహలంగా మారింది. పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. తీరంలో ఇసుకతో సైకత శివలింగాలు చేసుకుని పూజలు చేశారు. అనంతరం తీరం వెంబడి ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాలు, భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని తన్మయం చెందారు.

- బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులు ఆదివారం శివాలయాలకు పోటెత్తారు. జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్వాలాతోరణం కృతికా దీపం కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.
- కోవూరు : స్థానిక గాంధీ పార్కు సెంటర్‌లో కామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ చైర్మన్ బి.సురేష్, ధర్మకర్తలు పి.మోహన్, హనుమారెడ్డి, నాగరాజు ఉన్నారు.



ముత్తుకూరు : సిద్ధేశ్వరాలయంలో..



పొదలకూరు : ప్రత్యేకాలంకరణలో రామలింగేశ్వరుడు



మనుబోలు : ప్రత్యేక అలంరణలో వీరభద్రస్వామి



బుచ్చిరెడ్డిపాళెంరూరల్ : కామాక్షితాయి ఆలయంలో..



మనుబోలు : చేతిగోరుపై సూక్ష్మ శివలింగం



మనుబోలు : ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ఇందుకూరుపేట : కొమరికలో..



ఇందుకూరుపేట: తీరంలో సైకత శివలింగాలకు పూజలు